ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంజాన్ వేళలు

ఇఫ్తార్ - సోమవారం

సాయంత్రం - 6.32

సహర్ - మంగళవారం

ఉదయం - 5.00




క్యాంప్ కార్యాలయంలో అనుచరులతో ఎంపీ రంజిత్‌రెడ్డి

అటా.. ఇటా? అని అనుకున్నట్టుగానే చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి చివరకు హస్తం వైపే మొగ్గు చూపారు. బీఆర్‌ఎస్‌లోనే కొనసాగాలా? లేక కాంగ్రెస్‌లో చేరాలా? అని కొన్ని రోజులుగా సంకోచించిన ఆయన కాంగ్రెస్‌కే జై కొట్టారు. ఆదివారం నగరంలో సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఆయనకే దక్కుతుందనే చర్చా సాగుతోంది. కాగా ఆయన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు రాజీనామా లేఖ పంపారు. సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేసి రెండు లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. కారు పార్టీ ప్రజాప్రతినిధులను, సీనియర్ నాయకులను పార్టీలో చేర్చుకుంటోంది.

బీఆర్‌ఎస్‌కు రంజిత్‌రెడ్డి గుడ్‌బై!

- మొయినాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలతో భేటీ
- కారు పార్టీని ఖాళీ చేయడమే కాంగ్రెస్ ధ్యేయం
- లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పావులు
- పార్టీ వీడుతున్న నేతలతో బీఆర్‌ఎస్ సతమతం



పార్టీకి రాజీనామా వెంటనే కాంగ్రెస్‌లో చేరిక



సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 17 : పార్లమెంట్ ఎన్నికల వేళ ఉమ్మడి జిల్లాలో రాజకీయాలు ఊహించని విధంగా మలుపులు తిరుగుతున్నాయి. ఎప్పుడు ఎవరు ఏ పార్టీలోకి జంప్ అవుతారో తెలియడం లేదు. 'సొంత పార్టీలోనే కొనసాగుతా.' అని చెప్పిన నేతలు గంటల్లోనే కండువాలు మార్చుతున్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయినప్పటి నుంచి వరుస షాక్‌లతో ఆ పార్టీ కోలుకోలేకపోతోంది. ఇప్పటికే ఎంతో మంది కీలక నేతలు పార్టీ మారారు. ఒక్కొక్కరుగా పార్టీకి దూరమవుతున్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ఉమ్మడి జిల్లాలో బలమైన నేతలైన ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా ఇపుడు చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సైతం అనూహ్యంగా బీఆర్‌ఎస్‌కు రాంరాం చెప్పి కాంగ్రెస్ గూటికి చేరారు. అంతేకాదు పాలక పార్టీ కండువా కప్పుకున్న కొద్ది గంటలకే ఆయన మొయినాబాద్‌లో కాంగ్రెస్ నేతలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వాస్తవానికి కొద్ది రోజులుగా ఆయన కాంగ్రెస్‌లో చేరతారని జోరుగా ప్రచారం జరుగుతున్నా ఆయన బయటపడలేదు. ఆదివారం అకస్మాత్తుగా బీఆర్‌ఎస్ చీఫ్ కేసీఆర్‌కు రాజీనామా లేఖను పంపారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతకు ముందు తన రాజీనామా విషయాన్ని ప్రజలకు సోషల్ మీడియా వేదికగా తెలియజేశారు. 'ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో నేను బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నాను. ఇంత కాలం నాకు పార్టీలో సహకరించిన అందరికీ ధన్యవాదాలు. ఇన్ని రోజులు చేవెళ్ల ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన కేసీఆర్, కేటీఆర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు.' అని తన సందేశంలో పేర్కొన్నారు. తన రాజీనామాను ఆమోదించాలని గులాబీ అధినేతను కోరారు. ఇదిలా ఉంటే రంజిత్‌రెడ్డితో పాటు మరి కొందరు నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, యాదయ్య ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. అలాగే మాజీ మంత్రి మల్లారెడ్డి ఇటీవలే బెంగళూరు వెళ్లి కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో భేటీ అయ్యారు.

క్యాంప్ కార్యాలయంలో రంజిత్‌రెడ్డి సుధీర్ఘ మంతనాలు

మొయినాబాద్ రూరల్: చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన నేపథ్యంలో మండల పరిధి ఎన్కేపల్లిలో గల క్యాంప్ కార్యాలయంలో తన అనుచరులతో ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సుదీర్ఘ మంతనాలు జరిపారు. ఈ సందర్భంగా చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే మనందరి లక్ష్యం అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పార్టీ టికెట్ తనకు వస్తుందని, తానే మళ్లీ చేవెళ్ల ఎంపీగా గెలవడం ఖాయమన్నారు. ఎంపీ సీటు నుంచి పోటీచేయడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి పూర్తి వివరాలు వెల్లడిస్తానని ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి ఆంధ్రజ్యోతికి వెల్లడించారు. కాంగ్రెస్‌లో చేరిన రంజిత్‌రెడ్డికి ఆయన అనుచరులు, స్థానిక నాయకులు, కార్యాకర్తలు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు మేలు జరుగుతుందనే తాను కాంగ్రెస్‌లో చేరానని రంజిత్‌రెడ్డి అన్నారు. కాగా క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశమేమీ నిర్వహించలేదు. చర్చల్లో నాయకులు డి.అంజనేయులు, మహేందర్‌రెడ్డి, బాల్‌రాజ్, పలు మండలాల బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణులు రంజిత్‌రెడ్డి కార్యాలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతు ప్రకటించాయి.



మల్లారెడ్డి నివాసంలో సమావేశమైన మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధి ఎమ్మెల్యేలు

బీఆర్‌ఎస్ విజయానికి సమష్టిగా కృషి చేయాలి

మేడ్చల్ మార్చి 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి నివాసంలో ఆదివారం మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధి ఎమ్మెల్యేలు సమావేశయ్యారు. మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్‌బీనగర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సుధీర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు,నవీన్‌రావు సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయానికి తామంతా కృషిచేయాలని నిర్ణయించారు. ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని, ఇందుకు విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో నేతలు మహేందర్‌రెడ్డి, భాస్కర్‌యాదవ్, శేఖర్‌గౌడ్, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణుల దాహార్తి తీర్చేందుకు చర్యలు

బషీరాబాద్, మార్చి 17 :వన్య ప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మైల్వార్ అటవీ ప్రాంతంలో తాండూరు ఫారెస్ట్ రేంజర్ శ్యాంసుదర్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం మూడు సాసర్ పిట్స్‌లలో ట్యాంకర్‌తో నీరు నింపారు. రేంజర్ మట్లాడుతూ ఎండకాలంలో వాగులు, వంకలు ఎండిపోయి వన్య ప్రాణులు నీటికి ఇబ్బందులు పడతాయన్నారు. తాగునీరు దొరక్క ప్రాణులు చనిపోయే ఆస్కారం కూడా ఉందన్నారు. దాహం తీర్చుకునేందుకు వన్యప్రాణులు కొన్నిసార్లు జనావాలసాల్లోకి, పొలాల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. కాబట్టి అడవుల్లో నిర్మించిన సాసర్ పిట్స్‌లో నీరు నింపి ప్రాణుల దాహార్తిని తీరుస్తున్నామన్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఒక్కో సాసర్ పిట్‌లో నెలకు నాలుగు సార్లు నీరు నింపుతామని చెప్పారు.



సాసర్ పిట్‌లో నీరు నింపుతున్న అటవీ సిబ్బంది

నామినేటెడ్ సందడి!

- పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా గురునాథ్‌రెడ్డి
- రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా కాల్వ సుజాత
- పట్టణ మౌలిక సదుపాయాల ఆర్థిక సంస్థ చైర్మన్‌గా రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి
- మల్‌రెడ్డి రాంరెడ్డికి రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్‌గిరీ!

కొడంగల్, మార్చి 17 : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికలపై గురిపెట్టింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ చేపట్టింది. పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కృషిచేసిన నాయకులకు ప్రభుత్వం నామినేటెడ్ పదవులిస్తూ వారి సేవలకు గుర్తింపు ఇస్తోంది. ఈ నేపథ్యంలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడు, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. ఈ క్రమంలో కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి గెలుపునకు విశేష కృషి చేసిన గురునాథ్‌రెడ్డికి పోలీసు గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆదివారం గురునాథ్‌రెడ్డి ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గురునాథ్‌రెడ్డి రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీతో ప్రారంభమైంది. కొడంగల్ ఎమ్మెల్యేగా ఐదు సార్లు గెల్చారు. సర్పంచ్ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎంపీపీ, ఎమ్మెల్యే స్థాయికి ఎదిగారు. 1992లో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనకు పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చింది. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, ప్యాక్స్ చైర్మన్ కటకం శివకుమార్‌గుప్తా, లయన్స్ క్లబ్ సభ్యులు దాసప్ప యాదవ్, మురారి వశిష్ట, రమేశ్, జయతీర్థచారి తదితరులు గురునాథ్‌రెడ్డిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

కాల్వ సుజాతకు సముచిత స్థానం

తాండూరు: తాండూరు నియోజకవర్గానికి రెండోసారి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవి దక్కింది. తాండూరు పట్టణానికి చెందిన కాల్వ సుజాతను రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇంతకు ముందు తాండూరుకే చెందిన ఏఐసీసీ సభ్యుడు మల్కుడ్ రమేష్ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా నియామకమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్లుగా పార్టీకి పనిచేసిన వారిని గుర్తించి పలు కార్పొరేషన్లకు నామినేటెడ్ పదవులను కట్టబెట్టింది. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్న కె.సుజాత ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె టికెట్ ఆశించారు కానీ కొన్ని సమీకరణాల వల్ల పార్టీ ఆమెకు టికెట్ ఇవ్వలేకపోయింది. అయితే పార్టీ గెలుపు కోసం ఆమె జిల్లా వ్యాప్తంగా ప్రచారంలో పాల్గొన్నారు. పార్టీకి సుజాత అందజేస్తున్న సేవలను గుర్తించి అధిష్టానం అమెను ప్రభుత్వ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమించింది.

రంగారెడ్డి జిల్లా నేతలకూ పదవులు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్: అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు రాని నేతలకు ప్రభుత్వం పదవుల్లో పెద్దపీట వస్తోంది. రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి పట్టణ మౌలిక సదుపాయాల ఆర్థిక సంస్థ చైర్మన్ పదవి, మల్‌రెడ్డి రాంరెడ్డికి రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి దక్కాయి. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఎన్నికల సమయంలో క్రీయాశీలకంగా వ్యహరించారు. జిల్లెలగూడ ఉప సర్పంచ్‌గా, సర్పంచ్‌గా, సరూర్‌నగర్ జడ్పీటీసీగా, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. తర్వాత పీసీసీ సెక్రటరీగా తొమిదేళ్ల సేవలందించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా రెండు సార్లు పనిచేశారు. ప్రస్తుతం డీసీసీగా కొనసాగుతున్న ఆయనకు పట్టణ మౌళిక సదుపాయల ఆర్థిక సంస్థ చైర్మన్ దక్కింది. పార్టీ అధిష్టానానికి, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు.



గురునాథ్‌రెడ్డి

కాల్వ సుజాత

చల్లా నర్సింహారెడ్డి

రెండు ప్రాజెక్టుల ద్వారా సాగునీటిని తెస్తాం

- అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్



పరిగిలో విలేకరులతో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

పరిగి, మార్చి 17: ప్రాణహిత-చేవెళ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలతో ఉమ్మడి జిల్లాకు సాగునీటిని తెస్తామని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం పరిగిలోని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా అన్ని నియోజకవర్గాలకు సాగునీరందించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందన్నారు. రైతు సుభిక్షంగా ఉంటేనే, రాష్ట్రం పచ్చగా ఉంటుందని, రైతులకు రెండు ప్రాజెక్టులతో నీరందిస్తామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాను ఆగం చేసిందని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను వంద రోజుల్లో అమలు చేశామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. గత పదేళ్లలో ప్రభుత్వం రోడ్ల గురించి పట్టించుకోక అధ్వానంగా తయారయ్యాయని, రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారిస్తామన్నారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలై ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకంతో రాష్ట్రంలోని మహిళలంతా సంతోషంగా ఉన్నారన్నారు. మహిళా సాధికారికతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఇప్పటికే 93శాతం మంది రైతులకు రైతుబంధు జమ చేశామన్నారు. హైదారాబాద్-కొడంగల్ వరకు నాలుగు లేన్ల రహదారి ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. పరిగి నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి, తండాకు తారు రోడ్డు వేస్తామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కద్మూరు ఆనందం, కార్యదర్శి కె.హన్మంత్, పార్టీ పట్టణాధ్యక్షుడు ఇ.కృష్ణ, మండల అధ్యక్షుడు బి.పరశురాంరెడ్డి, వైఎస్ ఎంపీపీ సత్యనారాయణ, పాలాది శ్రీనివాస్, ఎస్.రామకృష్ణ, పి.చిన్ననర్సింహులు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్త్ పరీక్షలు



హాల్‌టికెట్ నంబర్లు చెక్ చేస్తున్న అధికారులు

- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన విద్యా శాఖ
- విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాయాలని అధికారుల సూచన
- పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు అనుమతి లేదు

వికారాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో నేటి(సోమవారం) నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఇందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్ష కేంద్రాల్లో హాల్ టికెట్ నంబర్లు వేయడం సహా విద్యార్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలూ కల్పించారు. ఈ నెల 18(నేటి నుంచి) ఏప్రిల్ 2వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. జిల్లాలో పదో తరగతి పరీక్షలకు మొత్తం 15,509 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో మొత్తం 80 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 80 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 80మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 10మంది కస్టోడియన్లు, రెండు కేంద్రాల్లో జాయింట్, అడిషనల్ కస్టోడియన్లను నియమించారు. 750మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, రెండు కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణపై కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, జిల్లా విద్యా శాఖ, సంబంధిత ఇతర అధికారులతో సమీక్షలు నిర్వహించారు. పరీక్ష ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహిస్తారు. గతేడాది తాండూరులో ఎదురైన సంఘటన నేపథ్యంలో పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేలా కలెక్టర్ కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. కాపీయింగ్‌కు పాల్పడే వారిపై, సహకరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

ప్రతీ పరీక్ష కేంద్రంలో క్లోస్డ్ సర్క్యూట్(సీసీ) కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల రికార్డు మధ్యే ప్రశ్నపత్రాల సీల్స్ తెరుస్తారు. పోలీసుస్టేషన్లకు దూరంగా ఉన్న 'సి' ఎగ్జామ్ సెంటర్లకు పోలీసు భద్రత మధ్య ప్రశ్నపత్రాలను తరలించేందుకు వాహనాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు ఇలా ఎవరూ సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు తీసుకెళ్లకుండా తనిఖీలు చేస్తారు. పరీక్ష సమయంలో ఎవరైనా అస్వస్థతకు గురైతే ప్రథమ చికిత్స అందించేందుకు ఏఎన్ఎంలను సిద్ధంగా ఉంచుతారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధిస్తారు. పరీక్ష కొనసాగేంత వరకు చుట్టుపక్కల జిరాక్స్, కంప్యూటర్ సెంటర్లను మూసేయిస్తారు. నివాస ప్రాంతాల్లో ఉన్న పరీక్ష కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. సిబ్బంది ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా ధరించేలా ఆదేశాలిచ్చారు. విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద డీఈవో, ఎంఈవోల సెల్‌ఫోన్ నంబర్లను డిస్ప్లే చేస్తారు. హాల్ టికెట్లు రాని వారు బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.

వికారాబాద్ జిల్లా..	
పరీక్షలు రాసే విద్యార్థులు	: 15,509
బాలురు	: 8,297
బాలికలు	: 7,212
రెగ్యులర్ విద్యార్థులు	: 13,209
బాలికలు	: 6,356
బాలురు	: 6,853
మొత్తం పరీక్ష కేంద్రాలు	: 80
రెగ్యులర్ విద్యార్థుల సెంటర్లు	: 70
ప్రైవేట్ విద్యార్థుల సెంటర్లు	: 10

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



జిల్లాలో పదో తరగతి పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు భయం వీడి ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. ఎండకాలాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి. తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానైనా చేరుకోవాలి.

- రేణుకాదేవి, డీఈవో, వికారాబాద్

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు



విజయలక్ష్మి, డీఈవో, మేడ్చల్

మేడ్చల్ మార్చి 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని, విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని డీఈవో విజయలక్ష్మి తెలిపారు. ఈ సారి మెరుగైన ఫలితాలు సాధించి రాష్ట్రంలో టాప్‌లో జిల్లాను నిలుపుతామన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 18 నుంచి టెన్త్ వార్షిక పరీక్షలు జరుగుతున్నాయని

231 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

పది పరీక్షలకు 47,406 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో 46,834 మంది రెగ్యులర్, 572 మంది ప్రైవేట్ విద్యార్థులున్నారు. 231 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 10, చీఫ్ సూపరింటెండెంట్లు 231మంది, డిపార్ట్‌మెంటల్ అధికారులు 231, ఇన్విజిలేటర్లు 2,760 మందిని నియమించారు. ప్రైవేట్‌గా పరీక్ష రాసేవారికి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాపీయింగ్‌కు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. కేంద్రాల వద్ద తాగునీరు అందుబాటులో ఉంచుతారు. అలాగే వైద్య సిబ్బంది సైతం ఉంటారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక చికిత్స మందులు ఉంచుతారు. కలెక్టర్ ఆధ్వర్యంలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని డీఈఓ స్పష్టం చేశారు.

అయిదు నిమిషాల గ్రేస్ టైం

ఈ సారి పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించేందుకు నిమిషం ఆలస్యం నిబంధన లేదు. పరీక్ష ప్రారంభ సమయానికి ఐదు నిమిషాల లోపు ఆలస్యం వరకు విద్యార్థులను అనుతిస్తారు. అంతకు మించితే మాత్రం పరీక్షకు అనుమతించరు. పరీక్షకు ఆలస్యమైతే విద్యార్థికే నష్టం జరుగుతుందని అధికారులు తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి రోజూ ఉదయం 9గంటలలోపు చేరుకోవాలన్నారు. 9.30గంటల నుంచి పరీక్ష ప్రారంభం అవుతుంది. కాగా విద్యార్థులకు ఏదేని కారణాలతో హాల్ టికెట్ అందకున్నా నేరుగా బోర్డ్ ఆఫ్ సెంకండరీ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని డీఈవో తెలిపారు. హాల్ టికెట్‌పై హెచ్‌ఎం లేదా ప్రిన్స్‌పాల్ సంతకం కూడా అవసరం లేదని పేర్కొన్నారు.

మల్లన్న కల్యాణోత్సవానికి ఆహ్వానం



సుధీర్‌రెడ్డికి ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్‌టౌన్, మార్చి 17 : మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్ మల్లన్న స్వామి కల్యాణోత్సవ వేడుకల్లో పాల్గొనాలని పలువురు స్థానిక కాంగ్రెస్ నేతలు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్ చాపరాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పలువురు కాంగ్రెస్ నేతలు సుధీర్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు.

ఉపాధ్యాయుడికి అరుదైన అవకాశం

● ఎస్సీఈఆర్టీకి ఎండీ యాసీన్ ఎంపిక



ఎండీ యాసీన్

వికారాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లా ఉపాధ్యాయుడికి అరుదైన అవకాశం లభించింది. బషీరాబాద్ జడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ యాసీన్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్సీఈఆర్టీ)లో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించేందుకు ఎంపికయ్యారు. రాష్ట్ర విద్యా విభాగాన్ని బలోపేతం చేసేందుకు ఎస్సీఈఆర్టీలో ఫ్యాకల్టీగా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించేందుకు ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా, 28 పోస్టులకు అన్ని జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. మూడంచెల ఎంపిక ప్రక్రియలో జిల్లాకు చెందిన ఎండీ యాసీన్ ఎంపికయ్యారు. శనివారం ఆయన ఎస్సీఈఆర్టీలో ఫ్యాకల్టీగా విధుల్లో చేరారు. రెండేళ్ల పాటు ఆయన డిప్యూటేషన్‌పై అక్కడ కొనసాగనున్నారు. పనితీరు ఆధారంగా మరో ఏడాది డిప్యూటేషన్‌ను పొడిగించే అవకాశం ఉంటుంది. ఎస్సీఈఆర్టీలో ఫ్యాకల్టీగా ఎంపికైన యాసీన్‌ను సహచర ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందనలతో ముంచెత్తారు.

నేడు పాంబండపై
కొబ్బరి కాయల విక్రయానికి వేలం

కులకచర్ల, మార్చి 17: మండలంలోని పాంబండ బండవెల్కిచర్ల గ్రామ పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి పెద్ద జాతర సందర్భంగా కొబ్బరి కాయల విక్రయానికి సోమవారం వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నర్సమ్మ రాములు, ఈవో సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.2వేలు డిపాజిట్ చేయాలని, వేలంలో దక్కించుకున్న వారు సాయంత్రంలోపు పూర్తి డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈనెల 30 నుంచి ఏప్రిల్ 10 వరకు ఆలయం ఆవరణలో కొబ్బరి కాయల విక్రయానికి అవకాశం ఉంటుందన్నారు.

నేడు కాంగ్రెస్‌లో చేరనున్న బీఆర్ఎస్ నేతలు

మేడ్చల్ టౌన్, మార్చి 17 : మేడ్చల్ మాజీ సర్పంచ్ చిలుక రాజు తనయుడు, మున్సిపల్ కౌన్సిలర్ రామన్నగారి మణికంఠగౌడ్ సోమవారం 500మందితో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. మేడ్చల్ మున్సిపల్ పాలకవర్గంలో చిన్న వయసు ఉన్న మణికంఠకు స్థానికుంగా యువకుల్లో మంచిపట్టు ఉంది. దీంతో ఆయన తన అనుచరులతో కాలిసి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. పట్టణంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్‌ల సమక్షంలో పార్టీలో చేరుతున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున్న సభను నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

రంజిత్‌రెడ్డి వందల ఎకరాలు పోగేశారు

● బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్

చేవెళ్ల, మార్చి17: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని వ్యాపార కేంద్రంగా మలుచుకుని, రియల్ ఎస్టేట్ బ్రోకర్లను దగ్గర పెట్టుకుని ఎంపీ రంజిత్‌రెడ్డి వందల ఎకరాలు పోగేసి బీఆర్‌ఎస్ పార్టీని నాశనం చేశారని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ ఆరోపించారు. ఆదివారం చేవెళ్లలో ఆయన ప్రతిక ప్రకటన విడుదల చేశారు. రంజిత్‌రెడ్డి అడ్రస్ లేని వ్యక్తి అని, చేవెళ్ల ఎంపీగా గెలిపిస్తే ప్రజాసేవ చేయకుండా మండలాల వారీగా వందల ఎకరాల భూములు సమకూర్చుకున్నారని విమర్శించారు. చేవెళ్ల అభివృద్ధికి ఎంపీగా ఆయన చేసిందేమీ లేదన్నారు. తన ఆస్తులను కాపాడుకునేందుకు అధికారకాంగ్రెస్ పార్టీలో చేరారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆయనకు బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

యథేచ్ఛగా సుద్ద తరలింపు!

తాండూరు మీదుగా అక్రమ రవాణా

● కర్ణాటక నుంచి మారేపల్లిలో డంపింగ్
● విదేశాలకు ఎగుమతికి కాకినాడ పోర్టుకు తరలింపు
● వారం రోజుల్లో 10వేల టన్నులు తరలిన సుద్ద

తాండూరు, మార్చి 17: కర్ణాటక నుంచి తాండూరు మీదుగా కొన్ని రోజులు అక్రమంగా పుల్లర్ ఎర్త్ మినరల్(ఖనిజ సంపద) రాయల్టీ, జీఎస్టీ లేకుండా పెద్దఎత్తున తరలిపోతోంది. ప్రస్తుతం పెద్దేముల్ మండలం మారేపల్లి ప్రాంతంలో సుద్ద తవ్వకాలు నిలిచిపోయాయి. అయితే ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర రాయల్టీని వర్తింపజేసి కాకినాడ పోర్ట్ ద్వారా విదేశాలకు ఎగుమతి చేయాలని ప్రయత్నిస్తున్నారు. కర్ణాటకలో సుద్ద ఎగుమతులకు లీజులు ఇవ్వడం నిలిపివేసి కర్ణాటక, తాండూరు మైన్స్ అధికారులతో సంబంధిత కంపెనీలు కుమ్మక్కై తెలంగాణ రాయల్టీని వాడుకున్నారు. కర్ణాటకలోని కల్బురిగి జిల్లాకల్గీతాలుకా కొడ్లి గ్రామంలో కొఫియా మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ చట్ట విరుద్ధంగా తవ్వకాలు జరిపి తరలించిన సుద్దను పెద్దేముల్ మండలం మారేపల్లిలో నిల్వపెట్టి కాకినాడ తరలించారని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా(మార్కిస్ట్) నాయకులు రాత పూర్వకంగా అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కర్ణాటక, తెలంగాణ రాష్ట్రం తాండూరు మైనింగ్ శాఖకు విచారణకు ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు నిర్ణయించారు. అటు కర్ణాటక సబ్ మినరల్ రూల్స్ 1994 ప్రకారం ఖనిజాలను అక్రమ రవాణా చేసిన కాఫియా మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీపై చర్యలు తీసుకోవాలంటూ కమ్యూనిస్టు నేతలు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా కర్ణాటక ఖనిజ సంపదకు తెలంగాణ రాష్ట్రం తాండూరు నుంచి రాయల్టీ ఇవ్వడంపై తప్పుపట్టారు. వారం రోజులుగాసుమారు 10వేల మెట్రిక్ టన్నుల సుద్దను తరలించడానికి మైన్స్ అధికారులు సహకరించారని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే పెద్దేముల్ మండలం మారేపల్లి నుంచి పేరుమోసిన ప్రభుత్వ కంపెనీ పుల్లర్స్ ఎర్త్‌ను దొంగిలించారని మనీ లాండరింగ్ ఇతర అక్రమ లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. కర్ణాటక నుంచి తాండూరు మీదుగా మారేపల్లికి తరలిస్తున్న సుద్దను ఆపి తనిఖీలు చేయకుండా అటు సరిహద్దు కర్ణాటక చెక్‌పోస్టు, ఇటు తాండూరు చెక్‌పోస్టు మైన్స్‌అధికారులు సంబంధిత కంపెనీతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


సరిహద్దు కర్ణాటకలో సుద్ద తవ్వకాలు

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

● వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్, మార్చి 17: జిల్లాలో పార్లమెంటు ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా రాజకీయ ప్రజా ప్రతినిధులు సహకరించాలని వికారాబాద్ వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఎన్నికల నియామవళి అమలు, విధివిధానాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆదివారం అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీ ప్రతినిధులు ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు సహకరించాలన్నారు. పార్టీలు గానీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, పార్టీలు గానీ అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేసి ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు పాల్పడకూడదని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సౌకర్యాలను సమకూర్చుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వికారాబాద్ డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్, బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, సీపీఎం ప్రతినిధులతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం

కడ్తాల్, మార్చి17 : లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధిస్తుందని జడ్పీటీసీ జర్పులదశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్,సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్‌ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్ అన్నారు. బీఆర్‌ఎస్‌ను దెబ్బతీసేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సాగిస్తున్న ఎత్తుగడలను ప్రజలు తిప్పికొట్టక తప్పదన్నారు. కడ్తాల మండల బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం బీఎస్పీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. నాగర్‌కర్నూల్‌లో ఆయన ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ నియంత పాలనను కొనసాగిస్తోందని మండిపడ్డారు. దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకొని నీచరాజకీయాలకు, బెదిరింపులకు ఒడిగట్టిందని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యుడు బాచిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు జోగు వీరయ్య, ఎంపీటీసీలు బొప్పిడి గోపాల్, లచ్చిరామ్ నాయక్, ప్రియ రమేశ్, నర్సింహ్మాగౌడ్, నరేశ్, బీఎస్పీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ యాదవ్, ఉన్నారు.


ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్పీటీసీ దశరథ్, బీఆర్‌ఎస్ నాయకులు

పవర్ లేని ప్రత్యేకాధికారులు!

● చెక్ పవర్ లేక తప్పని ఇబ్బందులు
●అస్తవ్యస్తంగా పంచాయతీ పాలన

బషీరాబాద్, మార్చి 17: గ్రామపంచాయతీల్లో ప్రత్యేధికారుల పాలన ప్రారంభమై 40దాటినా సంబంధిత అధికారులకు చెక్‌పవర్ కల్పించలేదు. దీంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తంగా మారింది. పంచాయతీల నిర్వహణ, ప్రజాసమస్యల పరిష్కారంలో ఇబ్బందులు తప్పడంలేదు. ఫలితంగా గ్రామాల్లో అత్యవసర సమస్యల పరిష్కారానికి కార్యదర్శులు ఆర్థిక భారాన్ని భరించాల్సివస్తోందని చెబుతున్నారు. గతంలో సర్పంచులు సొంతంగా డబ్బులు ఖర్చు చేసి ఆ తర్వాత బిల్లులు పెట్టుకునేవారు. ఇప్పుడు ప్రత్యేకాధికారులు తమసొంత ఖర్చు చేయడానికి ముందుకు వచ్చే పరిస్థితి లేదు. దీంతో సమస్యలు తీరడంలేదు. పంచాయతీల్లో ఉన్న అరకొర నిధులనూ వినియోగించుకోవడానికీ అవకాశం లేకపోవడంతో పంచాయతీలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చినపక్పటికీ చెక్‌పవర్ కల్పించడంలో జాప్యం జరుగుతోంది. పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారుల పేరిట ఖాతాలు ఏర్పాటు చేసుకోకపోవడానికి డిజిటల్ కీ పొందే ప్రక్రియ కొలిక్కి రాలేదని తెలిసింది. ఈ పరిస్థితుల్లో పంచాయతీలకు జమచేసిన నిధులు చెక్కుల రూపంలో పొందాలంటే విధిగా డిజిటల్ కీ అవసరమవుతుందని అధికారులు అంటున్నారు. ఒక్కో గెజిటెడ్ అధికారికి మూడు నుంచి నాలుగు పంచాయతీల ఇన్‌చార్జి బాధ్యతలు ఉండటంతో బ్యాంకులో అడ్డంకిగా మారుతున్నట్లు తెలుస్తోంది. బషీరాబాద్‌లో 36 గ్రామ పంచాయతీలు ఉండగా ఆరుగురు గెజిటెడ్ అధికారులకు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలిచ్చారు. వీరు గ్రామపంచాయతీలను సందర్శిస్తున్నా నిధులులేక ఏంచేయలేని దుస్థితిలో అలా వెళ్లి ఇలా వస్తున్నారు.


ప్రభుత్వం వెంటనే చెక్‌పవర్ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


పాలనకు ఆటంకం

ప్రతినెలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 15వ ఆర్థిక సంఘం నిధుల కింద ఎస్‌ఎఫ్‌సీ, జనరల్ ఫండ్ నిధులను మంజూరు చేయగా వాటిని సర్పంచులు, ఉపసర్పంచులు వారి చెక్‌పవర్ ద్వారా అవసరాల మేరకు వినియోగించేవారు.ప్రస్తుతం ఆ అధికారాలను ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, బ్లీచింగ్ పౌడర్, తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు, వీధిదీపాల నిర్వహణకు చెల్లింపులు చేయలేకపోతున్నామని పలువురు కార్యదర్శులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపులు, పంచాయతీ కార్మికుల వేతనాలు, ట్రాక్టర్ల కిస్తీలు కట్టడం ఇబ్బందిగా మారడంతో సతమతమవుతున్నారు. ఇదిలాఉండగా ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీల్లో పలు సమస్యలు పేరుకుపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

జోరుగా అక్రమ నిర్మాణాలు

» మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి
» సెల్లార్, సెట్ బ్యాక్‌పై నిర్లక్ష్య ధోరణి
» అనుమతులు లేకుండానే ఐదేసి అంతస్థుల నిర్మాణాలు

తాండూరు, మార్చి17: తాండూరులో అనుమతులు లేకుండా అంతస్తుల మీద అంతస్తులు కట్టేస్తున్నారు. మూడంతస్తుల భవనానికి అనుమతులు పొంది ఐదంతస్తుల వరకు నిర్మాణాలు చేపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమార్కులను ప్రోత్సహిస్తుండటంతో మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. నాలాలను, ప్రభుత్వ స్థలాలు, పార్కులను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు కనిపించడంలేదా? అని, మున్సిపాలిటీ అధికారుల మౌనం వెనుక ఆంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం అలసత్వంతోనే తాండూరు పట్టణంలో అక్రమ నిర్మాణాలు వందల సంఖ్యలో కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. స్థానికులు, ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్కువ స్థలంలో భారీ బిల్డింగ్‌లు, సెట్ బ్యాక్, పార్కింగ్ స్థలం లేకుండానే ఫంక్షన్‌లు, పెద్దపెద్ద భవంతుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. భవన నిబంధనలను పట్టించుకోకుండా పట్టణ శివారులోని కొడంగల్ రోడ్డులో ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగగానే నాలా పక్కనే రెండో ఫ్లోర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈనిర్మాణాన్ని కూల్చి వేయక పోతే పలు కాలనీలు ముంపునకు గురయ్యే అవకాశముందని పలువురు అంటున్నారు. పట్టణ నడిబొడ్డు ప్రాంతమైన శాంతినగర్ కాలనీలో నిర్మిస్తున్న ఆస్పత్రికి మూడంతస్తుల నిర్మాణానికి అనుమతులు పొంది ఐదంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. శాంతినగర్ పార్కు పక్కన మరో ఆస్పత్రి భవనమూ నిబంధనలకు విరుద్ధంగానే నిర్మితమవుతోంది. ఇలాంటి భవనాలు తాండూరులోవందల సంఖ్యలో నిర్మిస్తున్నారు.


తాండూరు-కొడంగల్‌మార్గంలో దుకాణాల నిర్మాణం

నోటీసులిచ్చి చర్యలు తీసుకుంటాం

అక్రమ నిర్మాణ దారులకు నోటీసులు ఇచ్చాం. సరైన డాక్యుమెంట్లు, అనుమతులు లేకుంటే చర్యలు తీసుకుంటాం. ఇంటి నిర్మాణం, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాలు, రేకుల షెడ్లు వేసే వారు సైతం నిబంధనల మేరకు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు పొందాలి. అక్రమ నిర్మాణాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం.

విక్రమ సింహారెడ్డి, తాండూరు పురపాలక సంఘం కమిషనర్


ఇందిరాచౌక్‌లో అనుమతి లేకుండా నిర్మాణాలు

చేవెళ్ల అభివృద్ధి కోసమే రాజకీయల్లోకి

● బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, మార్చి 17 : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న గ్రామాల అభివృద్ధి కోసమే రాజకీయల్లోకి వచ్చానని, ఎన్నికల్లో గెలిచినా, ఓడినా తాను ప్రజల మధ్యే ఉంటానని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీజేపీ చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గస్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని చేవెళ్ల పట్టణ కేంద్రంలోని సీహెచ్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం, పలువురు సీనియర్ నేతలతో కలిసి విశ్వేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దేశంలో మరోసారి ఏర్పడబోయేది బీజేపీ ప్రభుత్వమే అని అన్నారు. చేవెళ్ల పరిధిలో ఉన్న భూ కబ్జాదారులు, అవినీతిపరులు ఒక్కటై పోటీకి వచ్చినా ఓటర్లు బీజేపీ వైపే ఉన్నారని చెప్పారు.అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం మాట్లాడుతూ చేవెళ్ల ప్రాంతానికి ఏం అభివృద్ధి చేశారని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఓట్లు అడగడానికి వస్తున్నారని విమర్శించారు. వారికి ఓట్లు వేయొవద్దని ప్రజలకు సూచించారు. విశ్వేశ్వర్‌రెడ్డి ఎంపీగా గెలిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు అంజన్‌కుమార్‌గౌడ్, కంజర్ల ప్రకాశ్, మల్లారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నర్సింహరెడ్డి, జిల్లా నాయకులు రమణారెడ్డి, తొండ రవి, కుంచం శ్రీనివాస్‌గుప్తా, నాగర్జున్‌రెడ్డి, జంగం శివానందం, మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. కాగా శంకర్‌పల్లి మండలంలోని జన్వాడ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు రాములుగౌడ్, మాజీ ఎంపీపీ. బీర్ల నర్సింలు, నాయకులు ఉన్నారు.

సన్మార్గంతోనే దైవానుగ్రహం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, మార్చి17: సన్మార్గంతోనే దైవానుగ్రహం పొందవచ్చని, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అవ్వాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగే వారు ఆనందమయ జీవనాన్ని గడుపుతారని ఆయన చెప్పారు. తలకొండపల్లి మండలం దేవుని పడకల్ గ్రామంలో ఈనెల 24 నుంచి ప్రారంభమయ్యే శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాలు, వాల్‌పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన ఆలయాల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుందని చెప్పారు.బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని మాజీ సర్పంచ్ శ్రీశైలం ఆదివారం ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్‌కు ఆహ్వాన పత్రికలను అందజేశారు. సత్యం, శంకర్, బిక్షపతి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మేధాశక్తిని పెంపొందించుకోవాలి : ఎమ్మెల్యే వీర్లపల్లి


సైన్స్‌ఫెయిర్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, మార్చి 17 : విద్యార్థులు మేధాశక్తిని పెంచుకుని, సత్తాను చాటుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని శ్రీ వెంకటరమణ పాఠశాలలో శనివారం జరిగిన సైన్స్‌ఫేర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు ఎగ్జిబిట్లను ఆయన పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వీరమోని హేమదేవేందర్, వీరమోని దేవేందర్, ప్రిన్సిపాల్ విన్సన్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, కొడిచర్ల ఎంపీటీసీ బి. రవీందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతేకాకుండా కొత్తూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్గీయ రాజీవ్‌గాంధీ మెమోరియల్ క్రికెట్‌టోర్నీని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు జె. సుదర్శన్‌గౌడ్, జనిగె జగన్, నాయకులు జంగ నరింహా, కుమారస్వామిగౌడ్, ఇందూరి శ్రీనివాస్, గోవింద్ నాయక్, కర్రొల్ల సురేందర్, నవీన్‌చారి, అంజినాయక్, తేజేశ్వర్, పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు

కీసర, మార్చి 17: తహసీల్దార్ కార్యాలయంలో అవినీతికి పాల్పడినా, లంచాలు డిమాండ్ చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కీసర తహసీల్దార్ అశోక్ హెచ్చరించారు. బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సీఎంతో మీట్‌ది ప్రెస్ కార్యక్రమంలో ఓ జర్నలిస్టు కీసర తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కు కోసం లబ్ధిదారుల నుంచి రూ.6వేలు లంచం అడిగాడని ప్రశ్నించగా సీఎం రేవంత్‌రెడ్డి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు. దీనిపై కీసర తహసీల్దార్ ఆంధ్రజ్యోతి ప్రతినిధి వివరణ కోరగా తహసీల్దార్ కార్యాలయంలో ఎలాంటి పనికైనా లంచాలు డిమాండ్ చేసినా, అవినీతికి పాల్పడినా చర్యలు తీసుకుంటామన్నారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో లంచం అడిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టి కలెక్టర్‌కు సమగ్ర నివేదిక అందజేస్తామని చెప్పారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ధారూరు, మార్చి 17: పదో తరగతి పరీక్షలు నేటి (సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ధారూరు లక్ష 313మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు మండల విద్యాధికారి బాబుసింగ్ ఆదివారం తెలిపారు. ఈ పరీక్షల కోసం ధారూరు బాలుర ఉన్నత పాఠశాల, కేరెల్లి ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ధారూరు పరీక్ష కేంద్రంలో 172 మంది విద్యార్థులు , కేరెల్లి పరీక్ష కేంద్రంలో 141 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయన తెలిపారు.

కులకచర్ల: మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల, పుట్టపహాడ్, ముజాహిద్ పూర్, చౌడాపూర్, మరికల్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాల్లో అధికారులు ఆదివారం బెంచీలపై హాల్ టికెట్ నెంబర్లు వేసినట్లు హెచ్ఎం రవీందర్‌గౌడ్ తెలిపారు. ఉమ్మడి మండలంలో 1058 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో హబీబ్ అహ్మద్ తెలిపారు.

పూడూరు: మండలంలో మొత్తం 14ప రీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షా కేంద్రాల్లో మొత్తం 653 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.పరీక్షాకేంద్రాల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించారు.



కులకచర్ల ఉన్నత పాఠశాలలో నెంబర్లు వేస్తున్న హెచ్ఎం రవీందర్‌గౌడ్

మోమిన్‌పేట్: పదోతరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో గోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పరీక్షాసమయానికి అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. మండలంలోని మోమిన్‌పేట్ బాలుర, బాలి కల, ఎన్కతల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 376మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా 150మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. మండల కేంద్రంలోని జిరాక్స్ కేంద్రాలను పరీక్షా సమయంలో మూసి ఉంచాలని ఎస్ఐ అరవింద్ సూచించారు.

కొడంగల్ రూరల్: పదోతరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కొడంగల్‌లో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో రాంరెడ్డి ఆదివారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో రెండు పరీక్షాకేంద్రాలు, బాలుర పాఠశాలలో ఓపరీక్షా కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలి: ఎస్పీ



వికారాబాద్ : జిల్లాలో పదోతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరీక్ష కేంద్రాల లోపలికి సెల్‌ఫోన్ తీసుకొని వెళ్లడానికి ఎవరికీ అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ కేంద్రాలు పరీక్షా సమయాల్లో మూసివేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ఎక్కడైనా ట్రాఫిక్ ఇబ్బందులు కలిగితే డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

బషీరాబాద్: బషీరాబాద్‌లో నేటి(సోమవారం) నుంచి జరిగే పదోతరగతి వార్షిక పరీక్షల దృష్ట్యా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని బషీరాబాద్ ఎస్ఐ రమేష్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జడ్పీ హెచ్ఎస్ పాఠశాల బాలురు, బాలికలు, మోడల్ స్కూల్‌లో మూడు కేంద్రాలు ఏర్పాటు చేసినందున జిరాక్స్ కేంద్రాలు తెరవొద్దన్నారు. అదేవిధంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తెలంగాణ-కర్ణాటక సరిహద్దు గ్రామాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మైల్వార్, ఇందర్‌చెడ్, నవాంద్గీ గ్రామాల వద్ద చెక్‌పోస్టుల్లో నిరంతరం పోలీసునిఘా కొనసాగుతుందన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి

● తోటి ఉద్యోగి పెళ్లికి వెళ్లి వస్తుండగా ఘటన



కృష్ణకుమార్(ఫైల్)

వికారాబాద్, మార్చి 17: తోటి ఉద్యోగి పెళ్లికి కారులో వెళ్లివస్తుండగా కారు అదుపు తప్పి ఏఆర్ కానిస్టేబుల్ మృతిచెందాడు. ఈ ఘటన వికారాబాద్ మండలం పులుసుమామిడి శివారులో ఆదివారం చోటుచేసుకుంది. వికారాబాద్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఎన్కేపల్లి శివారులో కానిస్టేబుల్ పెళ్లికి వికారాబాద్ నుంచి మిత్రులు ఏఆర్ కానిస్టేబుళ్లు అగ్గనూర్ కృష్ణకుమార్ (34), దిలీప్‌కుమార్, రాజు, నరేందర్‌లు కలిసి కారులో వెళ్లారు. తిరిగివస్తూ మార్గమధ్యన పులుసుమామిడి సమీపంలోని వంతెన వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి వంతెనను ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణకుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్నన మరో ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. మృతుడికి బషీరాబాద్ మండలం అల్లాపూర్ గ్రామం కాగా 2018లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. మృతుడికి భార్య నర్సమ్మ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, నాలుగేళ్ల కొడుకు, రెండున్నరేళ్ల కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా కృష్ణకుమార్ భౌతికకాయాన్ని సందర్శించిన ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

పూడూరు, మార్చి 17: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. పరిగి మండలంలోని సైదపల్లి గ్రామానికి చెందిన చాకలి మొగులయ్య(40) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మొగులయ్య భార్య అనిత అనారోగ్యంతో బాధపడుతూ సిరిగాయిపల్లిలోని పుట్టింట్లో ఉంది. శనివారం మొగులయ్య భార్యను చూసేందుకు బైక్‌పై సిరిగాయిపల్లి వెళ్లాడు. రాత్రి తిరిగి వెళ్తున్న క్రమంలో పూడూరు మండలం సోమన్‌గుర్తి గ్రామశివారులోకి రాగానే గుర్తుతెలియని వాహనం మొగులయ్య బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో మొగులయ్య తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు చాకలి సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు..

తాండూరు రూరల్, మార్చి 17: సిరిగిరిపేట్ గ్రామంలో అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సిరిగిరిపేట్‌కు చెందిన వడ్డె పరమేష్(24) అనే యువకుడి తల్లిదండ్రులు మృతిచెందడంతో అన్నా, వదినల వద్దే ఉంటున్నాడు. రోజు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 15రోజుల కిందట వడ్డె పరమేష్‌కుక మల్కాపూర్‌కు చెందిన యువతితో నిశ్చితార్థం జరిగింది. ఉగాది తర్వాత పెళ్లి నిశ్చయించారు. పరమేష్ పెళ్లి విషయంలో ఇంట్లో గొడవలు ప్రారంభమయ్యాయి. పెళ్లి చేయాలంటే డబ్బులు కావాలని, ఆ డబ్బులు మీరే భరించాలంటూ పరమేష్ తన అన్నా, వదినలతో వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. శనివారం రాత్రి సైతం వారి ఇంట్లో గొడవ జరిగినట్లు సమాచారం. ఆదివారం ఉదయం పరమేష్ తన ఇంటి ఆవరణలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందడంతో గ్రామస్తులు వెంటనే కరన్‌కోట్ పోలీసులకు సమాచారం అందించారు. తాండూరు రూరల్ సీఐ అశోక్ తన సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకున్నారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి గ్రామస్తులను ఆరాతీశారు. పరమేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే అన్న పండరి, వదిన నాగమ్మలు మృతుడు పరమేష్‌ను సరిగ్గా చూసుకునేవారు కాదని మృతుని మేనమామ వడ్డె రాములు ఆరోపించాడు. పెళ్లికి రూ.50వేలు తీసుకురావాలని పరమేష్‌ను తన అన్నా, వదినలు వేధింపులకు గురి చేశారని, దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపాడు. ఈ మేరకు పరమేష్ అన్నా, వదినలపై అనుమానం వ్యక్తం చేయడంతో వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు

మూడుచింతలపల్లి, మార్చి 17: వీధికుక్కల దాడిలో 18నెలల చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోఎని అద్రాస్‌పల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కరుణాకర్ కూతురు రష్మిత ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడికి చేశాయి. పాపను చుట్టిముట్టి ముఖం, ఇతర శరీర భాగాలపై కరిచాయి. గమనించిన స్థానికులు, కుటుంబీకులు కుక్కలను చెదరగొట్టారు. పాపను చికిత్స నిమిత్తం నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మూడుచింతలపల్లి, మార్చి 17: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం రాజీవ్ రహదారిపై హైదరాబాద్-కరీంనగర్ వెళ్లే దారిలో శామీర్‌పేట్ మండలం అలియాబాద్ రెవెన్యూ పరిధిలోని సోని దాబా దగ్గరలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని మృతదేహానికి శవ పంచనామా నిర్వహించారు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆ వ్యక్తి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెంది ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 9490617142, 9490617231 నెంబర్లకు సంప్రదించాలని పోలీసులు సూచించారు.

చీర్యాల ఓఆర్ఆర్ వద్ద మరో..

కీసర రూరల్: కీసర పోలీస్‌స్టేషన్ పరిధి చీర్యాల గ్రామంలోని ఓఆర్ఆర్ వద్ద ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు. బట్టతల ఉన్న మగ వ్యక్తి సుమారు 30 నుంచి 40సంవత్సరాల వయస్సు కలిగి ఉండి, 5.7అడుగుల ఎత్తు ఉన్నాడన్నారు. దాదాపు ఆరు రోజుల కిందటే అతడు మృతిచెంది ఉంటాడని తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు కీసర పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తంగా గాంధీ అనుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న శుభప్రద్‌పటేల్

వికారాబాద్, మార్చి 17: రంజాన్ ఉపవాస దీక్షలో భాగంగా ఆదివారం వికారాబాద్‌లోని ఏఎం ఫిట్నెస్ ఇమ్రాన్ జిమ్ నిర్వాహ కుడు ఇమ్రాన్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విందులో పాల్గొన్న ఆయన ఇమ్రాన్ ఇతర ముస్లింలకు ఫ్రూట్స్, జ్యూస్ ఇచ్చి ఉపవాసాన్ని విరమింప చేశారు. ఈ విందులో వికారాబాద్ పట్టణానికి చెందిన ముస్లిం సోదరులు రియాజ్, అమీర్, సుజిత్, పద్మాకర్, సంతోష్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన ఏబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌తో మహేష్ కుమార్

మేడ్చల్ టౌన్, మార్చి 17: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాగరి గారి ప్రీతమ్‌ను మేడ్చల్ ఏబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాను గంటి మహేష్‌కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రీతమ్‌కు శాలువాకప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఎస్సీల సంక్షేమానికి ఏర్పాటు చేసిన కార్పొరేషన్ ద్వారా దళితులకు న్యాయం చేకూరాలన్నారు. అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతోందని తెలిపారు.

సీఎంను కలిసిన గౌడవెల్లి మాజీ సర్పంచ్




సీఎంతో గౌడవెల్లి మాజీ సర్పంచ్ సురేందర్

మేడ్చల్ టౌన్, మార్చి 17: గౌడవెల్లి మాజీ సర్పంచ్, ప్రదేశ్‌కాంగ్రెస్ కమిటీ కోఆర్డినేటర్ సురేందర్ ముదిరాజ్ ఆదివారం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల 16 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన సందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

పరిగి, మార్చి 17: పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. పరిగిలోని చిన్నారి ఆస్పత్రిని ఆదివారం ఆయన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఓపీ విభాగాన్ని మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆస్పత్రులు డబ్బులే ప్రధానంగా కాకుండా పని చేయాలని సూచించారు. పేదలకు సేవలు అందించే ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రభుత్వం ఏమైనా అవసరాలు ఉంటే కూడా చేయూతను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, ఏఎంసీ మాజీచైర్మన్ సురేందర్, ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ చంద్రకాంత్ పాల్గొన్నారు.

ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పరిగి, మార్చి 17: ఈనెల 19 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న పరిగిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆదివారం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. యజ్ఞాల కోసం ఏర్పాటు చేసిన గుండాలను పరిశీలించారు. ఈ సమావేశంలో పరిగి మాజీ సర్పంచ్ సిద్ధాంతి పార్థసారథి, మాజీ జడ్పీటీసీ ఎస్‌పి బాబయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శి కద్మూరు ఆనందం, నాయకులు పి.చిన్ననర్సింహులు, అంజనేయులు పాల్గొన్నారు.

వీరశైవ భవనం నిర్మించాలి

వీరశైవలింగాయత్ సంఘం నాయకులు ఆదివారం పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డిని కలిశారు. వీరశైవలింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం వీరశైవ భవనం నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. అందుకు స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం తాలుకా అధ్యక్షుడు గుడ్డ శివరాజ్, ప్రధానకార్యదర్శి ప్రమతమాణిక్యం, నాయకులు ఉన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వాసుచంద్ర



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

పరిగి, మార్చి 17: పార్లమెంట్ ఎన్నికల నియమావళిని ప్రతీఒక్కరూ పాటించాల్సిందేనని వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర అన్నారు. ఎన్నికల కోడ్‌పై ఆదివారం అధికారులు, రాజకీయ పార్టీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ అమలుచేస్తున్న సువిధ, సి-విజిల్. సురక్ష, మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ యాక్టులపై వివరించారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా ఎక్కడా నలుగురికి మించి గుమిగూడరాదని సూచించారు. సమావేశాలు, ర్యాలీలకు సంబంధించి అనుమతికి సువిధ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అదేవిధంగా ఫ్లెక్సీలు, జెండాల ఏర్పాటుకు వ్యక్తిగత ఇళ్లపై పెట్టిన ఇంటియజమాని అనుమతి పత్రాన్ని రాయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించమని అన్నారు. వివరాలు లేకుండా డబ్బులు, మద్యం తరలిస్తే కేసులు తప్పవన్నారు. ఈ సమావేశంలో పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, ఎంపీపీ అరవింద్‌రావు, డీసీసీ కార్యదర్శి కొమిరె రాంచంద్రయ్య యాదవ్, సీపీఐ కార్యదర్శి పీర్‌మహ్మద్ పాల్గొన్నారు.

కొడంగల్: దేశంలో సార్వత్రిక ఎన్నికల నగరా మోగడంతో రాజకీయ నాయకులు పాటించాల్సిన జాగ్రత్తలపై వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆదివారం కొడంగల్ తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్, రెవెన్యూ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శామీర్‌పేట: రాజకీయ పార్టీలకు చెందిన వారు ఎవరైనా, ఎంతటి వారైనా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని, వెంటనే కఠిన చర్యలను తీసుకుంటామని సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఏఏఆర్ఓ), శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిన సందర్భంగా ఆదివారం ఆయన ఎన్నికల నిర్వహణకై నియమ నిబంధనలను మీడియాకు వివరించారు. శనివారం నుంచే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని చెప్పారు.

చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు

కొడంగల్, మార్చి 17: ఎన్నికల కోడ్ అమలు కావడంతో కొడంగల్ మండలంలోని రావుల్‌పల్లి, కస్తూర్‌పల్లి చెక్‌పోస్టుల దగ్గర పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ భరత్ రెడ్డి తెలిపారు. కొడంగల్ మండలంలోని కస్తూర్‌పల్లి చెక్ పోస్టును ఆదివారం పోలీసు సిబ్బందితో సందర్శించి వాహనాలను తనిఖీ చేశారు. కొడంగల్ ప్రాంతం కర్ణాటక సరిహద్దులో ఉండటంతో వాహనాల తనిఖీని ముమ్మరం చేసినట్లు, కోడ్‌అమలులో ఉండటంతో ప్రజలు రూ.50వేల కంటే ఎక్కువగా తీసుకెళ్తే అందుకు సంబంధించిన వివరాలను చూపించాల్సి ఉంటుందన్నారు.



కస్తూర్‌పల్లి చెక్‌పోస్టు వద్ద ప్రత్యేక పోలీసు బలగాలతో ఎస్ఐభరత్‌రెడ్డి

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

● జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 17 : విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టి ముందుకు సాగాలని జనగామ ఎమ్మెల్యే, అనురాగ్ యూనివర్సిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఆదివారం జరిగిన సినర్జీ-2024 యూనివర్సిటీ వార్షికోత్స కార్యక్రమంలో ఆయన పల్లాతో పాటు పద్మశ్రీ గడ్డం సమయ్యతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు నూతన అవిష్కరణలు చేపట్టాలని సూచించారు. పరిసర ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృత్రిమ మేధస్సు (ఏఐ) ను ఉపయోగించే విధంగా విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 6వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమా, వైఎస్‌చాన్సలర్ రామచంద్రం, రిజిష్ట్రార్ బాలాజీ ఉట్ల, డీన్లు ముత్తారెడ్డి, విజయకుమార్, సతీష్, వసుధాభక్తి, లక్ష్మి ప్రసన్న, సుధీర్‌రెడ్డి, శ్రీనివాస్‌చలపతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అఫీసర్ మల్లేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థికి ప్రశంసపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కీసర, మార్చి 17: ఘట్‌కేసర్ గురుకుల పాఠశాల 1974 సంవత్సరానికి చెందిన విద్యార్థులు స్వర్ణోత్సవ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 10వ తరగతి పూర్తి చేసుకొని 50వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం కీసరగుట్టలో కుటుంబ సమేతంగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు తమ అభిప్రాయాలను తెలియజేసి, జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి కృషి చేసిన స్థానిక ఎంపీటీసీ తటాకం నారాయణ శర్మను సహచర విద్యార్థులు శాలువాతో సత్కరించి సన్మానించారు. అదేవిధంగా ప్రతీ సంవత్సరం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకోవాలని సభ్యులు తీర్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య, వెంకటరాంరెడ్డి, విఠలేశ్వరశర్మ, నర్సింగ్‌రావు, నర్సింహారావు, ఆంజనేయులు, హనుమంత్‌రావు, పెంటయ్య, దశరథ, మానస, గుణసుందర, శారదలతో పాటు పలువురు పాల్గొన్నారు.



కీసర: కీసరగుట్టలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



పరిగి: పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో విద్యార్థులు

పరిగి: పరిగిలోని సాయిసిద్ధార్థ విద్యాలయంలో 2000-01లో టెన్త్ చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. దాదాపుగా 24ఏళ్ల తర్వాత కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పూర్వవిద్యార్థులు వారి గురువులను సన్మానించారు. వివిధ స్థాయిల్లో స్థిరపడి చాలా ఏళ్ల తర్వాత కలుసుకోవడం సంతోషకరంగా ఉందన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

దోమ, మార్చి 17: మండలంలోని మైలారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి బీజేపీ పార్టీ పరిగి నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ బూనెటి రూ.లక్ష ఆదివారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయాన్ని సందర్శించి కమిటీ సభ్యులతో మాట్లాడారు. గ్రామాల్లో ఆలయాల నిర్మాణం, హైందవ ధర్మ పరిరక్షణకు ప్రతీఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికలతో సంబంధం లేకుండా హిందూ ధర్మ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మోత్కూర్ మాజీ సర్పంచ్ కేశవులు, టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు హరికృష్ణ, బీజేపీ జిల్లా నాయకులు ఆంజనేయులు, ఆలయకమిటీ సభ్యులు బోయిని గోవర్దన్, మొగులయ్య, ఉపసర్పంచ్ నర్సింహులు, బీరప్ప, నర్సింహులు, వెంకటేశ్, రాంచందర్, దాసు, బాల్‌రాజ్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మైలారం గ్రామంలో ఆలయ నిర్మాణానికి విరాళాన్ని అందజేస్తున్న మారుతి కిరణ్ బూనెటి

పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలి

శామీర్‌పేట, మార్చి 17: మండలంలోని చిన్నకంచలోని ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్‌ను పొన్నాల్ గ్రామస్తులు కోరారు. మండలంలోని పొన్నాల్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నిరంజన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆగ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రమేశ్(మాజీ ఉపసర్పంచ్), సత్యనారాయణగౌడ్, నాగేశ్, రమేశ్, బాల్‌రాజ్, సంజీవ, గ్రామ నాయకులు వెళ్లి వజ్రేష్‌యాదవ్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. సీఎంతో మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు.

చలివేంద్రం ప్రారంభం



చిట్టిఘనాపూర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్థానికులు

తాండూరురూరల్, మార్చి 17 : తాండూరు మండలం చిట్టిఘనాపూర్‌లో కీర్తిశేషులు వై.బ్రహ్మానందరెడ్డి జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం బ్రహ్మానందరెడ్డి కుమారుడు యాదల ప్రభాకర్‌రెడ్డి పటేల్, వీరయ్యస్వామి చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, అధ్యాపకులు వెంకట్‌రాములుగౌడ్, శాంతికుమార్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

మోదీని కలిసిన బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు

వికారాబాద్, మార్చి 17: బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర నాయకుడు సదానందారెడ్డి దేశప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. తెలంగాణ పర్యాటనలో హైదరాబాద్ వచ్చిన మోదీని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

బీజేపీ విస్తృత స్థాయి సమావేశానికి తరలిన నాయకులు



సమావేశానికి బయల్దేరుతున్న పార్టీ కార్యకర్తలు, నాయకులు

నవాబుపేట, మార్చి 17: దేశం కోసం మోదీ.. మోదీ కోసం మనం అంటూ బీజేపీ నాయకులు అన్నారు. ఆదివారం చేవెళ్ల నియోజకవర్గ బీజేపీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి నవాబుపేట మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కలిసికట్టుగా పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సారా జగన్, పులిమామిడి ఎంపీటీసీ తేజస్వీని, రామకృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గాలయ్య, నాయకులు శేఖర్‌రెడ్డి, దర్మయ్య, గౌస్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డికి సన్మానం

బొంరాస్‌పేట్, మార్చి 17: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డికి ప్రభుత్వం రాష్ట్ర పోలీసు హౌసింగ్ చైర్మన్‌గా నియమించడంతో మాజీ సర్పంచ్‌లు, నాయకులు సన్మానించారు. కొడంగల్‌లో ఆదివారం లింగన్‌పల్లి, పర్సాపూర్ మాజీ సర్పంచ్‌లు కాశప్ప, సయ్యద్ అంజద్, నాయకులు నర్సిములు, రాములు, వెంకటయ్య తదితరులు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.